క్లుప్తంగా

ఆరోగ్య రక్ష కార్డుల పంపిణీ

కృత్తివెన్ను: చిన్నారుల్లో సాధారణంగా వచ్చే వ్యాధులను వైద్య పరీక్షల ద్వారా ముందుగానే గుర్తించి చిన్నపాటి చికిత్సలతో నయం చేయవచ్చని లక్ష్మీపురం పీహెచ్‌సీ వైద్యులు హుస్సేన్ అన్నారు. బుధవారం మండలంలోని చినగొల్లపాలెం ఏటిమొండి పల్లెపాలెం ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ఆరోగ్య కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనంలో వచ్చే సాధారణ వ్యాధులను, పుట్టుకతో వచ్చిన లోపాలను వైద్య పరీక్షల ద్వారా గుర్తించి చికిత్స అందజేసేందుకు ఈ హెల్త్‌కార్డులు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది ఉపాధ్యాయులు ఉండి పురుషోత్తం పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో విద్యార్థుల సత్తా

గూడూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జగ్గయ్యపేటలో జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ సెలక్షన్స్‌లో మల్లవోలు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. ఈనెల 22న జరిగిన జిల్లాస్థాయి అండర్ -14 విభాగం పోటీలలో కృష్ణా జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన పి.యోషిత, పి.రూట్‌ప్రెన్సి, అండర్-17 విభాగంలో కె.కీర్తన, కె.దీపికలు సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.అరుణ తెలిపారు. జిల్లాస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన పాఠశాల విద్యార్థినులను, వారికి శిక్షణ ఇచ్చిన వ్యాయామోపాధ్యాయులు పి.రవి, పి.రాజేష్‌లను ఆమె అభినందించారు.

జీవాలకు నట్టల నివారణ మందు పంపిణీ

సంగమేశ్వరం(నాగాయలంక): మండలంలోని సంగమేశ్వరం గ్రామ పంచాయతీ పరిధిలో బుధవారం మండల పశు వైద్యాధికారి డాక్టర్ సీహెచ్. సాయి మౌనిక నేతృత్వంలో సామూహికంగా 18 వందల గొర్రెలు, మేకలకు ఉచిత నట్టల నివారణ మందును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మౌనిక గొర్రెలు, మేకల యజమానులకు నట్టల నివారణ మందుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ఈనెల 31వ తేదీ వరకు కొనసాగుతుందని, మండలంలో 13 వేల జీవాలకు మందు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకు 4 వేల జీవాలకు మందు ఇచ్చామని వివరించారు. భావదేవరపల్లి సంగమేశ్వరం గ్రామాలలో 500 చొప్పున పర్రచివరలో 400, పెదకమ్మవారిపాలెంలో 300, నాగాయలంకలో 100 జీవాలకు నట్టల మందు ఇచ్చారు. కార్యక్రమంలో గొర్రెలు, మేకల యజమానుల సంఘం కార్యదర్శి లోయ మస్తాన్, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

పెడన: మానవ హక్కులు, చట్టాలపై విద్యార్థి దశ నుంచి అవగాహన ఉండాలని పలువురు వక్తలు వ్యాఖ్యానించారు. బుధవారం మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో మానవ హక్కుల వేదిక (ఏపీ హ్యూమన్ రైట్స్) ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక ఫౌండర్ డాక్టర్ బొడ్డుపాటి దాస్, రాష్ట్ర జనరల్ సెక్రటరీ గోవాడ ప్రశాంతి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఆర్ఎస్‌రెడ్డి, కోఆర్డినేటర్ ఎస్.అనిల్, విభాగాధిపతులు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

బంటుమిల్లి: బంటుమిల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మచిలీపట్నం ఈఈ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 విద్యుత్ సబ్ స్టేషన్‌లో మెయింటెనెన్స్ కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించి తగిన విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన కోరారు.

పోలీస్ విధులపై విద్యార్థులకు అవగాహన

నాగాయలంక: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం రాత్రి విద్యార్థులకు ఎస్ఐ కలిదిండి రాజేష్ నేతృత్వంలో పోలీస్ ఓపెన్ హౌస్ నిర్వహించారు. నాగాయలంకలోని విద్యాభారతి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు తమ విధి నిర్వహణలో ఉపయోగించే ఆయుధాలు, పరికరాలు, సాధనాలు వాటి సాంకేతిక పరిణామాలను ఎస్ఐ విద్యార్థులకు వివరించారు. పలువురు విద్యార్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. స్టేషన్ రైటర్ సనకా రాజా, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

అవనిగడ్డ: తోటి విద్యార్థి పట్ల సహ విద్యార్థులు చూపిన సేవాభావం పలువురికి ఆదర్శనీయమని అవనిగడ్డ సీఐ యువ కుమార్ అన్నారు. ఇటీవల కోడూరు మండలం నక్కవానిదారి గ్రామానికి చెందిన విజయబాబు ఇల్లు, పశువుల చావిడి పూర్తిగా కాలిపోయాయి. అవనిగడ్డలోని ఎస్వీఎల్ క్రాంతి జూనియర్‌కాలేజీలో విజయబాబు కుమారుడు లోకేష్ చదువుతున్నాడు. తమ సహచర విద్యార్థి కుటుంబానికి వచ్చిన కష్టాన్ని తెలుసుకున్న విద్యార్థులు రూ.50 వేలు సాయం అందించారు. బుధవారం కాలేజీలో లోకేష్ తండ్రి విజయబాబుకు సీఐ యువకుమార్, కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. లోకేష్ కాలేజీకి చెల్లించాల్సిన ఫీజులో రూ.30 వేలను కరస్పాండెంట్ మినహాయింపు ఇచ్చారు.

ఎక్కడి చెత్త అక్కడే

- నగరంలో పేరుకుపోతున్న చెత్తకుప్పలు
- మూలనపడ్డ చెత్త తరలింపు వాహనాలు
- వాహనాల డీజిల్‌కు నిధులు ఇవ్వని ప్రభుత్వం
- దుర్వాసనతో నగర ప్రజల ఇబ్బందులు

మచిలీపట్నంటౌన్: నగరంలో పారిశుద్ధ్య సమస్య రోజురోజుకు జఠిలమవుతోంది. పారిశుద్ధ్య నిర్వహణను పాలకులు గాలికొదిలేయటంతో నగరంలో ఎక్కడ చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో పాల్గొని నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని సాక్షాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించిన కొద్దిరోజులకే నగరంలో చెత్త సమస్య ఉత్పన్నమైంది. ఈ సమస్యకు రాష్ట్ర ప్రభుత్వమే కారణం కావటం కొసమెరుపు.



నగరంలోని నాగపోతరావు సెంటరు సమీపంలో డస్ట్‌బిన్ చుట్టూ పేరుకుపోయిన చెత్త

ఉన్నతాధికారి మాటకు భిన్నంగా..

నగరంలో పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగుపరిచి ఆహ్లాద వాతావరణాన్ని నెలకొల్పేందుకు స్వచ్ఛ మచిలీపట్నం కోసం కృషి చేస్తామని కలెక్టర్ డీకే బాలాజీ వీడియోను విడుదల చేశారు. దీనికి నగర ప్రజలు తడి, పొడి చెత్తను విడివిడిగా చెత్త సేకరణ వాహనాలకు అందజేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రస్తుతం అసలు చెత్త సేకరణే సరిగ్గా నిర్వహించలేకపోతున్నారు. నగరంలో ఇంటింటికీ చెత్తను సేకరించేందుకు క్లాప్ కార్యక్రమం ద్వారా 41 వాహనాలను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

మూలనపడ్డ చెత్త తరలింపు వాహనాలు..

క్లాప్ కార్యక్రమం ద్వారా నగరంలో ఏర్పాటు చేసిన వాహనాలు నగరంలోని 41 డివిజన్లలో ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించి డంపింగ్‌యార్డుకు చేరవేసేవి. మిగిలిన 9 డివిజన్లలో మున్సిపాలిటీ ట్రాక్టర్ల ద్వారా చెత్తను సేకరించే వారు. అయితే కూటమి ప్రభుత్వం గత 15 రోజులుగా ఈ వాహనాలకు ఆయిల్ సరఫరా నిధులను నిలిపివేసింది. దీంతో ఈ వాహనాలు మూలకు చేరాయి. 41 డివిజన్లలో వాహనాల సమస్య ఒక్కసారిగా ఎదురుకావటంతో నగరపాలక సంస్థకు చెందిన 10 ట్రాక్టర్లను, మూడు కంపాక్టర్ల ద్వారా 50 డివిజన్లలోని చెత్తను ఉదయం నుంచి రాత్రి వరకు సేకరిస్తున్నారు.

పూర్తిగా చెత్త సేకరణ చేయలేక..

అయినా పూర్తిస్థాయిలో చెత్త సేకరణ జరగకపోవటంతో పలు డివిజన్లలో చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో దుర్వాసన అధికమై ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. పారిశుద్ధ్య కార్మికులు పుష్‌కాట్లను తోసుకుంటూ ఉదయం, సాయంత్రం చెత్తను సేకరిస్తున్నారు. అయితే ప్రతి ఇంటికీ వెళ్లి చెత్త సేకరించటంలో జాప్యం చోటు చేసుకుంటోంది. దీంతో సేకరించిన చెత్తను కార్మికులు కొన్ని ప్రాంతాల్లో డంప్ చేస్తున్నారు. ఈ చెత్తకుప్పలు రోజులతరబడి నిల్వ ఉండటంతో సమస్య ఎదురవుతోంది.

గతంలో ఇలా..

క్లాప్ కార్యక్రమంలో భాగంగా నగరంలో 41 చెత్త సేకరణ వాహనాలు ఆయా డివిజన్లలో ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు చేరవేసేవి. అక్కడ ఈ చెత్తను కంపాక్టర్లలోకి లోడ్ చేసి గుంటూరులోని చెత్త నుంచి విద్యుత్ తయారీ కేంద్రానికి పంపేవారు. దీని ద్వారా నగరపాలక సంస్థకు కొంత ఆర్థిక వెసులుబాటు కలిగేది. ఈ వాహనాలు మూలనపడటంతో ట్రాక్టర్ల ద్వారా సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులో పడేసి నిప్పుపెడుతున్నారు. ఫలితంగా డంపింగ్ యార్డులో చెత్త మళ్లీ పేరుకుపోతోంది.

సీఎం చెప్పిందొకటి..

ముఖ్యమంత్రి ఇటీవల నగరానికి వచ్చినప్పుడు డంపింగ్‌యార్డును పరిశీలించి ఈ ప్రాంతంలో చెత్త లేకుండా చేస్తామని చేసిన ప్రకటనకు ప్రస్తుతం జరుగుతున్న సేకరణ తీరుకు సంబంధం లేకుండా పోయింది. ఇటీవల మంత్రి కొల్లు రవీంద్ర 'బంగారు బందరు' కార్యక్రమాన్ని నిర్వహించి డంపింగ్‌యార్డులోసుందరమైన పార్కును నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ హామీని ఎప్పటికి నెరవేరుస్తారోనని నగర ప్రజలు ఎదురుచూస్తున్నారు.

కాలనీ దారిలో మద్యం షాపు వద్దు

డీటీ, ఎక్సైజ్ అధికారులకు మహిళల వినతి



ఘంటసాల: జగనన్న కాలనీలోని మా ఇళ్లకు వెళ్లే రహదారిలో మద్యం షాపు వద్దంటూ కాలనీకి చెందిన మహిళలు అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఘంటసాల మల్లంపల్లి రోడ్డులోని జగనన్న కాలనీకి వెళ్లే దారిలో మద్యం షాపు ఏర్పాటు చేసేందుకు చేస్తున్న సన్నాహాలను నిలుపుదల చేయాలని కోరారు. డిప్యూటీ తహసీల్దార్ బి.కనకదుర్గకు, మొవ్వ ఎక్సైజ్ స్టేషన్‌లో బుధవారం సాయంత్రం అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న కాలనీకి వెళ్లే రోడ్డులో మద్యం షాపు ఏర్పాటు చేసే ప్రాంతానికి 100 మీటర్ల లోపు చర్చి, జగనన్న కాలనీ నివాస గృహాలు, ప్రథమ చికిత్స కేంద్రం ఉన్నాయన్నారు. విద్యార్థులు పాఠశాలలు, కాలేజీలకు వెళ్లాలన్నా ఈ రోడ్డు వెంబడే ప్రయాణించాల్సి ఉంది. మద్యం షాపు రోడ్డు పక్కనే ఏర్పాటు చేస్తే విద్యార్థులు, మహిళలు మందు బాబుల ఆగడాలకు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి మా ఇళ్ల మధ్య మద్యం షాపు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీహెచ్.కాశిమ్మ, జి.సునీత, ఎం.సుమలత, ఎస్.దేవి, బి.అనురాధ, డి.దుర్గ, నాగమల్లేశ్వరి, జయలక్ష్మి, కె.బేబీ సరోజిని, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పురుగు మందుపై తలోమాట

పోలీసులకు ఫిర్యాదు చేసిన రైతులు

పెడన: మండలంలోని జింజేరు గ్రామంలో కొందరు రైతులు స్థానికంగా దళారి వద్ద బిల్లులు లేకుండా 'పిక్సలాన్' అనే నకిలీ పురుగుమందు కొనుగోలు చేసి పంట దిగుబడి కోసం వినియోగించారు. అది పనిచేయకపోగా పంట దెబ్బతింది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై 'నట్టేట ముంచిన నకిలీ' అంటూ 'సాక్షి'లో ఈ నెల 6వ తేదీన కథనం ప్రచురితమైన విషయం పాఠకులకు విదితమే. దీనిపై స్పందించిన వ్యవసాయశాఖాధికారులు మరుసటి రోజు విచారణ చేశారు. జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయ టెక్నికల్ ఏవో సి.శాంత, పెడన ఇన్‌చార్జి ఏవో నూరున్నీసా పంట పొలాలను పరిశీలించారు. రైతుల నుంచి వివరాలు సేకరించారు. ధాన్యం కొనుగోలు వ్యాపారి మామిడి లక్ష్మీనారాయణ వద్ద కొనుగోలు చేశామని, అతను రశీదులు ఇవ్వలేదని ఎంవీ గోవర్ధన్, వీరబాబు, గోపాలరావు తదితర రైతులు వ్యవసాయశాఖాధికారులకు వివరించారు. మందు పనిచేయకపోగా పంట గుల్ల అయిందని ఆవేదన వ్యక్తం చేశారు.



దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న సైంటిస్టులు (ఫైల్)

ఈ నెల 10న లాం ఫాంకు చెందిన సైంటిస్టులు ఎస్‌వీఎస్ గోపాలస్వామి, డాక్టర్ ఎన్.సాంబశివరావు, మచిలీపట్నం నుంచి శాస్త్రవేత్త డాక్టర్ కె.నాగేంద్రరావు శాంపిల్స్‌ను తీసుకువెళ్లారు. సైంటిస్టులు రిపోర్టును 21న జిల్లా వ్యవసాయశాఖాధికారులకు పంపించారు. ఇది నకిలీ పురుగుమందుగా తేల్చారు. వాస్తవంగా సదరు కంపెనీ, వ్యవసాయశాఖాధికారులు ఈ నకిలీ పురుగు మందు గురించి పోలీసులకు ఫిర్యాదు చేయాలి. అయితే రైతులనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని వ్యవసాయాధికారులు సూచించడంతో వారు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు ఫిర్యాదు మాత్రమే తీసుకున్నారు కానీ, కేసు ఫైల్ చేయలేదు. ఇంతకాలం మిన్నకుండిపోయిన వ్యవశాయశాఖాధికారులు తాజాగా సైంటిస్టులు పంపిన రిపోర్టు ఆధారంగా బుధవారం ఇన్‌చార్జి ఏవో నూరున్నీసా, పలువురు నకిలీ పురుగుమందు విక్రయించిన వ్యక్తి ఇంటిని పరిశీలించారు. ఏమీ దొరకలేదని ఏవో నూరున్నీసా చెప్పారు. మొదట్లో తనిఖీలు చేయకుండా ఇప్పుడు చేస్తే ప్రయోజనం ఏముంటుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై జిల్లా వ్యవసాయాధికారి పద్మావతి మాట్లాడుతూ నకిలీ పురుగు మందు విషయమై సైంటిస్టులు పంపించిన నివేదిక వచ్చింది. దీనిపై పోలీసులను ఆశ్రయించాల్సిందిగా రైతులకు సూచించాం. మా సిబ్బంది క్షేత్రస్థాయిలో తనిఖీలకు వెళ్లినా ఏమీ లభించలేదు. రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేపట్టాల్సి ఉంది.

పాడి రైతులు పథకాలను వినియోగించుకోవాలి

కోనేరుసెంటర్: పాడిరైతుల కోసం అమలు చేస్తున్న పథకాలను సక్రమంగా విని యోగించుకోవాలని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. బందరు మండలం చిట్టిపాలెం, గంటల మ్మపాలెం గ్రామా ల్లోని పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘాలను బుధవారం ఆయన సందర్శించారు. ఆంజనేయులు మాట్లాడుతూ యూనియన్ పాడి రైతులకు అందించే ధర వ్యత్యాసం, కల్యాణమస్తు, క్షీర బంధు, ప్రతిభ, యాక్సిడెంట్ కేర్ ట్రస్ట్ పథకాలతో పాటు పాడి పశువులకు అందించే పశు బీమా, డీ వార్మింగ్, పశు దాణా, కాల్షియం, మినరల్ మిక్సర్ వాడటం వలన కలిగే ప్రయోజనాలను తెలిపారు. యూనియన్ అందించే సెమెన్ ద్వారా పుట్టిన దూడలు భవిష్యత్‌లో ఎక్కువ పాలచార కలిగిన పశువులుగా రైతులకు అధిక లాభాలు ఆర్జించి పెడతాయన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణా మిల్క్ యూనియన్ పాలకవర్గ సభ్యులు అర్జా వెంకట్ నగేష్, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ లింగం ప్రసాద్, గుడ్లవల్లేరు పాల శీతల కేంద్రం మేనేజర్ తోట సత్యనారాయణ, సంఘ అధ్యక్షుడు చండిక నాగబాబు, చండిక విజయలక్ష్మి, సూపర్‌వైజర్ పెయ్యేటి బసవరాజు కుమార్, సంఘ పాలకవర్గ సభ్యులు పాల ఉత్పత్తి దారులు పాల్గొన్నారు.

కార్మికులకు పీఎఫ్ 12 శాతమే మినహాయించాలి

మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరరావు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న సెక్యూరిటీ, పారిశుద్ధ్య కార్మికులకు పీఎఫ్ 12 శాతం మాత్రమే మినహాయించాలని మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బెల్లంకొండ కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. సెక్యూరిటీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికుల సమస్యలపై బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ సెక్యూరిటీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికుల జీతాల నుంచి 12 శాతమే పీఎఫ్ సొమ్ము మినహాయించాల్సి ఉండగా కాంట్రాక్టర్ 25 శాతం మేర మినహాయిస్తున్నారని, మిగిలిన 13 శాతం ఎవరి ఎకౌంట్‌లో జమ అవుతోందో అర్థం కాని పరిస్థితి నెలకొందన్నారు. అదనంగా మినహాయిస్తున్న 13 శాతాన్ని సెక్యూరిటీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికుల ఎకౌంట్లకు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ కార్డులు, గుర్తింపు కార్డులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంవత్సరానికి 15 సాధారణ సెలవులు ఇవ్వాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఫోన్‌లో కోరగా అంగీకరించారని జాతీయ సెలవులపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని కోటేశ్వరరావు తెలిపారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు, సెక్యూరిటీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంఘ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరరావు

మా భూములను ఆన్‌లైన్ చేయండి

కృత్తివెన్ను: గతంలో ఆన్‌లైన్‌లో ఉన్న భూములు ప్రస్తుతం ఆన్‌లైన్‌లో కనిపించడం లేదని, వాటిని తిరిగి ఆన్‌లైన్‌లో చేర్చాలంటూ మండలంలోని యండపల్లి, గాంధీనగరం రైతులు రెవెన్యూ అధికారులకు విన్నవించుకున్నారు. బుధవారం యండపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద భూముల రీ సర్వేకు సంబంధించిన గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో రైతులు మా గ్రామానికి చెందిన 700 ఎకరాల భూములకు గతంలో పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్నాయని, ఆన్‌లైన్‌లో కూడా పేర్లు ఉండేవన్నారు. రీ సర్వే తరువాత వాటన్నిటికీ ఒకే ఎల్‌పీ నంబర్ ఇచ్చి ఆన్‌లైన్ చేయడంతో రైతుల పేర్లు భూమి వివరాలు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదన్నారు. దీని వల్ల బ్యాంకులో రుణాలు తీసుకోవడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని అర్జీలో పేర్కొన్నారు. డెప్యూటీ తహసీల్దార్ శశికుమార్, ఆర్ఐ, సర్వేయర్లు, సర్పంచ్ పిన్నెంటి ప్రభుప్రసాద్, కార్యదర్శి ఉమామహేశ్వరి, రైతులు పాల్గొన్నారు.



చోడవరం సభలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

చోడవరం(నాగాయలంక): మండలంలోని చోడవరం గ్రామంలో రీ సర్వేలో వచ్చిన భూ సమస్యలు పరిష్కార కార్యక్రమంపై బుధవారం గ్రామ సభ జరిపారు. మండల డెప్యూటీ తహసీల్దార్ అబ్దుల్ రఫీ ఆధ్వర్యంలో జరిగిన ఈ గ్రామసభలో వివిధ సమస్యలపై రైతుల నుంచి 17 ఫిర్యాదులు అందినట్లు ఆయన తెలిపారు. భావదేవరపల్లి సర్పంచి మండలి ఉదయభాస్కర్, నంగేగడ్డ మాజీ సర్పంచి బావిరెడ్డి వెంకటేశ్వరరావు, మండల సర్వేయర్ రామకృష్ణ, తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సనకా జనార్ధనరావు, వీఆర్‌వో అజయ్, ఇతర వీఆర్వోలు, గ్రామ సర్వేయర్ పాల్గొన్నారు.

నాగాయితిప్ప(మోపిదేవి): మండలంలోని నాగాయితిప్ప పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరావు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ కాలంలో చేసిన భూ సర్వేను శతాబ్దకాలం తరువాత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో రీ సర్వే చేపట్టినట్లు తెలిపారు. దానిపై ప్రస్తుతం ప్రభుత్వం అనేక విమర్శలు చేసినప్పటికీ తిరిగి జనన్న సూచించిన మార్గంలోనే అనుసరించడం అభినంద నీయమన్నారు. రైతు మేజర్ కంఠంనేని బాబయ్య మాట్లాడారు. తన 2.23 ఎకరాల్లో రీ సర్వే వల్ల 11 సెంట్లు భూమి తగ్గినట్లు ఎప్‌పీలో సూచిస్తోందని సరిచేయాలని అధికారులను కోరారు. పలువురు రైతులు తమ సమస్యలపై అర్జీలు అందజేశారు. డీటీ వాణి, ఇన్‌చార్జి ఆర్ఐ ఎం.శ్రీనివాసరావు, ఏవో హెప్సిబారాణి, గ్రామ సర్వేయర్‌లు శరత్, సృజన, వీఆర్వోలు వెంకటరమణ, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపల్లి(ఘంటసాల): రీ సర్వే భూముల సమస్యలు పరిష్కరించడానికి కొత్తపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన గ్రామ సభలో 16 అర్జీలు వచ్చినట్లు డెప్యూటీ తహసీల్దార్ బి.కనకదుర్గ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ డీటీ పి.శ్రీనివాసరావు, ఆర్ఐ కె.శ్రీనివాసరావు, మండల సర్వేయర్ వల్లీ పుష్ప, ఏవో కె.మురళీ కృష్ణ, వీఆర్వో వెంకటేశ్వరరావు, రైతులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


కోడూరు: సమాజాన్ని పట్టిపీడిస్తున్న మత్తు పదార్థాలు, గంజాయికి యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని పాలకాయతిప్ప మెరైన్ సీఐ సురేష్ రెడ్డి అన్నారు. బుధవారం స్వతంత్రపురం జెడ్పీ పాఠశాల, కోడూరు కోట రాఘవయ్య విద్యాసంస్థల విద్యార్థులకు మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను సీఐ వివరించారు. చెడు స్నేహాలు, ఫోన్లకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండడంతో పాటు తల్లిదండ్రులకు కూడా వీటిని వివరించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎస్ఐలు జిలానీ, ఉజ్వల్, హెచ్ఎంలు ఏవీ రమణ, అనిల్‌కుమార్, జగన్, కరుణ, తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందుల వినియోగం తగ్గించాలి

కోసూరువారిపాలెం(మోపిదేవి): పురుగుమందుల వాడకంపై రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని ఎంఏవో హెప్సిబారాణి తెలిపారు. మండలంలోని కోసూరువారిపాలెం, ఉత్తరచిరువోలులంక గ్రామాలలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పురుగుమందులు అధిక మోతాదులో వినియోగించడం వల్ల లాభం కంటే నష్టం వాటిల్లుతుందన్నారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనల మేరకు తగిన మోతాదులో మందులు పిచికారీ చేయాలని సూచించారు. ఆర్ఎంజీ, జీఐజీ గ్రూపుల గురించి వివరించారు. ఉద్యానశాఖ అధికారి ఎస్.రమేష్, ఆయిల్‌ఫాం కంపెనీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రావి జగదీష్ చంద్రబాబు, మేనేజర్ వి.శ్రీనివాసరావు, కోసూరు శివనాగమల్లేశ్వరావు, కోసూరు రాధాకృష్ణ, పలువురు రైతులు పాల్గొన్నారు.

ట్రూఅప్ చార్జీల పెంపుపై సీపీఎం నిరసన

బంటుమిల్లి: రాష్ట్రంలోని ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ప్రజలపై ట్రూ అప్ చార్జీల పేరుతో మోయలేని భారాలు మోపిందని సీపీఎం నాయకులు ఆరోపించారు. బుధవారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రం స్మార్ట్ మీటర్ల పేరుతో వినియోగదారులను ఇబ్బందులు పెడుతుంటే, రాష్ట్ర ప్రభుత్వ పాత బకాయిలు అంటూ ట్రూ అప్ చార్జీల పేరుతో దాదాపు రూ.8114 కోట్ల భారం మోపేందుకు సిద్ధపడిందన్నారు. ప్రభుత్వాలు విద్యుత్ వినియోగదారులపై భారాలు మోపితే సీపీఎం ఉద్యమం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. గతంలో సీపీఎం చేపట్టిన విద్యుత్ ఉద్యమం ఏ స్థాయిలో జరిగిందో ప్రస్తుత ఎన్‌డీఏ పాలకులు గుర్తు చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ట్రూ అప్ చార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం, రైతు సంఘం, సీఐటీయూ నాయకులు జి.నాగేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, బి.నాగరాజు, పి.ధనశ్రీ, ఎల్.అజయ్ ఘోష్, డి.రవి తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువు పెంపు

అవనిగడ్డ: డీఎస్సీ ఉచిత శిక్షణ కోసం ఎస్సీ, ఎస్టీల నుంచి దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగించినట్లు ఏఎస్‌డబ్ల్యూఓ బి.మోహనరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచితంగా డీఎస్సీ శిక్షణ అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. దరఖాస్తుల స్వీకరణ గడువు ఈ నెల 21తో ముగియడంతో ఎక్కువమంది వినియోగించుకోవాలన్న లక్ష్యంతో ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకునే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని మోహనరావు కోరారు.

హామీలను తుంగలో తొక్కిన ప్రభుత్వం

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను కాంగ్రెస్ కార్యకర్తలు ఎండగట్టాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి, డీసీసీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మార్పిడి బాబ్జి పిలుపునిచ్చారు. స్థానిక డీసీసీ కార్యాలయంలో బుధవారం కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు గొల్లు కృష్ణ అధ్యక్షతన సమావేశంలో బాబ్జి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు కావస్తున్నా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కిందన్నారు. సూపర్ సిక్స్ అని డూపర్ సిక్స్ చేశారని విమర్శించారు. జిల్లాలో పర్యటించి పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు నివేదిక ఇస్తామన్నారు. పలు నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకుచుట్టు పురుగు నివారణకు చర్యలు చేపట్టాలి

– కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ నవీన్

యండకుదురు(ఘంటసాల): వరి పంటలో ఆకుచుట్టు పురుగు నివారణ చర్యలను చేపట్టాలని ఘంటసాల కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ నవీన్ రైతులకు సూచించారు. మండలంలోని యండకుదురు, లంకపల్లి గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పొలాలను పరిశీలించారు. ఆకుచుట్టు పురుగు ఉధృతి ఉన్నట్లు గమనించారు. దీనిపై శాస్త్రవేత్త నవీన్ మాట్లాడుతూ ఆకుచుట్టు పురుగు నివారణకు ఫ్లూబెండమైడ్ 0.1మి.లీ. లేదా క్లోరాంట్రనిల్ ప్రోల్ 0.3మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. ఎంఏవో కె.మురళీ కృష్ణ, సర్పంచులు సర్పంచ్ ముళ్లపూడి పట్టాభి రామారావు, దున్న విజయలక్ష్మి, ఎంపీటీసీ సిద్ధినేని కుమార్ రాజా, బండి సుబ్బయ్య, కోళ్లపల్లి కిరణ్, వీఏఏస్ ఎస్.స్వాతి, జేవీఓ ఎల్.సత్య కనకరాజు, వీఏఏలు వి.నాగబాబు, ఏ.యువశ్రీ, రైతులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ నవీన్

సేఫ్టీ మిర్రర్ ఏర్పాటు

పెడన: మండల పరిధిలోని మడక గ్రామంలో పెట్రోల్ బంకు వద్ద తరుచుగా ప్రమాదాలు చోటు చేసుకోవడంతో భవిష్యత్తులో రోడ్డు ప్రమాదాలు జరగకుండా నిలువరించేందుకు సేఫ్టీ మిర్రర్‌ను ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ జి.సత్యనారాయణ తెలిపారు. బుధవారం ఈ మిర్రర్‌ను ఏర్పాటు చేశామని, అయితే వాహనదారులు రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను కూడా చూడకుండా మితిమీరిన వేగంతో వస్తుండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. వాహనదారులకు అతి వేగం వద్దని, రోడ్డు నిబంధనలు పాటించి ప్రయాణం చేయాలని ఆయన సూచించారు.

పూజాసామగ్రి అమ్మకం హక్కుల వేలం

అవనిగడ్డ: అవనిగడ్డ గ్రామంలో శ్రీ లంకమ్మ అమ్మ వారి ఆలయ ప్రాంగణంలో కొబ్బరి కాయలు, పూజా సామగ్రి అమ్ముకునేందుకు బుధవారం దేవాలయ అధికారులు వేలం నిర్వహించారు. ఈ వేలంలో పాల్గొన్న ఉప్పల కనకదుర్గ ఆలయ ప్రాంగణంలో కొబ్బరి కాయలు, పూజా సామగ్రి అమ్ముకునేందుకు ఏడాదికి అత్యధికంగా రూ.2.90 లక్షలకు వేలం కైవసం చేసుకుంది. గత ఏడాది రూ.2.80 లక్షలు పలుకగా ఈ ఏడాది రూ.2.90 లక్షలు పలికి రూ.10 వేల అధికంగా వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.